క్లుప్తంగా

నేడు వీర హనుమాన్ విజయ శోభాయాత్ర

కర్నూలు కల్చరల్: విశ్వ హిందూ పరిషత్, బజరంగదళ్ సంయుక్తంగా గురువారం హనుమజ్జయంతిని పురస్కరించుకొని బలోపాసన దివస్ పేరుతో వీర హనుమాన్ విజయ శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రతాప్‌రెడ్డి, గోరంట్ల రమణ తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు ఓల్డ్‌సిటీలోని జమ్మిచెట్టు లలితా పీఠం నుంచి శోభాయాత్ర ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రంజాన్ మాసం సందర్భంగా నగరంలోని రాజ్‌విహార్ సమీపంలో ఉన్న రిసాల్‌దార్ మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ పాల్గొన్నారు. బుధవారం రాత్రి మసీదు పెద్దలతో కలసి దువా చేశారు. కార్యక్రమంలో ముతవల్లి మొదీన్, ఖాజీ అక్బర్ మౌలానా రషాది, పార్టీ నాయకులు రియాజ్ బాబా, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ కోతలు విధించనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సి.క్యాంప్ సెక్షన్ పరిధిలోని రైతుబజార్, మద్దూర్ నగర్, ఠాగూర్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మరమ్మతు పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

భక్తిశ్రద్ధలతో పడిపూజ

కర్నూలు కల్చరల్: అయ్యప్ప స్వామి జన్మదినం ఉత్తరా నక్షత్రాన్ని పురస్కరించుకొని బుధవారం సప్తగిరి మణికంఠ అయ్యప్పస్వామి దేవాలయంలో పడి పూజ, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అయ్యప్ప భక్తుల శరణ ఘోషతో ఆలయం మార్మోగింది. శేషయాదవ్, హరినారాయణ, జయశేఖర్ బృందంచే నిర్వహించిన అయ్యప్ప భజన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. నృత్య శిక్షకులు డాక్టర్ భార్గవకుమార్ శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(రాజ్‌విహార్): ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ కర్నూలు-1, 2 డిపో కార్యదర్శులు మహేశ్వరరావు, ఆర్‌వీఎం రావు డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారం 28వ రోజు కొనసాగింది. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు.

మత్స్యకారుల యువజన విభాగం అధ్యక్షుడిగా అనిల్‌కుమార్

కర్నూలు(సెంట్రల్): జాతీయ మత్స్యకారుల సంఘం యువజన వి భాగం అధ్యక్షుడిగా కర్నూలుకు చెందిన తెలుగు అనిల్‌కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు సంఘం జాతీయ అధ్యక్షుడు సభాపతి, వర్కింగ్ చైర్మన్ ప్రభాకరణ్ నియామకపత్రాన్ని ఆయనకు పంపారు. తనపై నమ్మకం ఉంచి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని అనిల్‌కుమార్ పేర్కొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): సర్వ శిక్షా అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రతను కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈమేరకు మాట్లాడారు. అదేవిధంగా వ్యవసాయ కార్మిక సంఘం మాజీ కార్యదర్శి సునీత్ చోప్రా మృతి ప్రజా పోరాటాలకు తీరని లోటని ఎండీ అంజిబాబు పేర్కొన్నారు.

పండుగ రోజుల్లో సెలవులు ప్రకటించాలి

కర్నూలు కల్చరల్: పండుగ రోజులైన గుడ్ ఫ్రైడే, రంజాన్ పర్వదినాల్లో సెలవులు ప్రకటించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మిట్టా క్రిష్ణయ్య, వైష్ణవ కరుణానిధి మూర్తి కోరారు. ఎస్‌ఎస్‌సీ పరీక్షలు జరుగుతున్న పాఠశాలలకు సెలవులు ప్రకటించి కాంపెన్సేటరీగా ప్రభుత్వ సెలవు దినాల్లో పాఠశాలలు నిర్వహించాలనే ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణను కోరినట్లు వారు తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : దసరా, భోలా, దాస్ కా ధమ్కీ, బలగం
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : దసరా, పరారీ, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, దాస్ కా ధమ్కీ, దేశముదురు
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : సర్, దాస్ కా ధమ్కీ, దేశముదురు
ఐనాక్స్ : భోలా, డంజియన్స్ అండ్ డ్రాగన్స్ : హానర్ అమాంగ్ థీవ్స్, జాన్ విక్ చాప్టర్-4, ది సూపర్ మారియో బ్రదర్స్
భరత్ కాంప్లెక్స్ : జాన్ విక్ చాప్టర్-4, సర్
రాజ్ : వీరసింహారెడ్డి
శ్రీరామ : దేశముదురు

వైద్య విద్యార్థుల ఇష్టారాజ్యం

- కేఎంసీ వసతి గృహంలో జూనియర్లపై సీనియర్ల వేధింపులు
- తరగతులకు గైర్హాజరు
- చుట్టపు చూపుగా వెళ్తున్న వార్డెన్లు
- పట్టించుకోని అధికారులు



కర్నూలు మెడికల్ కాలేజీ వసతి గృహం

కర్నూలు(హాస్పిటల్): ఒకరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 400 మంది దాకా టీనేజీ వైద్య విద్యార్థులున్న వసతి గృహ సముదాయం అది. అలాంటి ప్రాంతంలో ఏ ఒక్కరి పర్యవేక్షణ లేకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. వార్డెన్లు చుట్టపుచూపుగా వెళ్తుండటంతో పలువురు విద్యార్థులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలోనే తోటి విద్యార్థులతో గొడవలు, జూనియర్లపై ర్యాగింగ్ సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.

కర్నూలు మెడికల్ కాలేజీ 1956లో ఏర్పాటైంది. అప్పట్లోనే ప్రస్తుతం రాజవిహార్ సెంటర్‌లో ఉన్న వసతిగృహ సముదాయం నిర్మించారు. కళాశాలలో ప్రస్తుతం ప్రతి సంవత్సరం 250 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు చేరుతున్నారు. ఈ మేరకు ఐదేళ్లకు మొత్తం 750 మంది విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారు. వీరిలో 400 మంది దాకా బాలురు, 150 మంది దాకా బాలికలు వేర్వేరుగా వసతి గృహసముదాయాల్లో ఉంటున్నారు. భోజనాలకు మాత్రం విద్యార్థులే డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే ఇటీవల కాలంలో పలువురు విద్యార్థులు మెస్ బిల్లులు కూడా సరిగ్గా చెల్లించకపోవడంతో పెండింగ్ బిల్లుల మొత్తం రూ.20 లక్షలు దాటింది. బిల్లులు చెల్లించాలని వార్డెన్లు పలుమార్లు నోటీస్‌బోర్డులో పేర్లతో సహా రాసినా వైద్య విద్యార్థుల నుంచి స్పందన కరువైంది.

తరగతులకు డుమ్మా కొట్టేవారే ఎక్కువ!

మెడికల్ కాలేజీ వసతి గృహంలో ఉంటున్న వారిలో 30 నుంచి 50 శాతం మంది విద్యార్థులు తరగతులకు సరిగ్గా హాజరుకావడం లేదని అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం డిజిటల్ అటెండెన్స్ ఉండటంతో ఏ రోజు, ఎవరు తరగతికి హాజరుకాలేదో ఎప్పటికప్పుడు తెలిసిపోతోంది. ఈ విషయాన్ని విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పినా వారిలో మార్పు రావడం లేదు. ముఖ్యంగా తరగతులకు సరిగ్గా వెళ్లక పలు పరీక్షలు తప్పి హాస్టల్‌లో ఉంటూ కాలయాపన చేసేవారు ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. ఇలాంటి వారితోనే వసతి గృహంలో సమస్యలు వస్తున్నట్లు వైద్యుల్లో చర్చ కొనసాగుతోంది.

పర్యవేక్షణ కరువు...!

ఎంబీబీఎస్ చదివే విద్యార్థుల వసతిగృహాల సముదాయానికి ప్రస్తుతం ఒక వార్డెన్, ఒక డిప్యూటీ, ఒక అసిస్టెంట్ వార్డెన్లను నియమించారు. 1979–82 మధ్య కాలంలో ఓ వైద్యుడు మాత్రమే ఇక్కడి వార్డెన్ క్వార్టర్‌లో ఉంటూ విద్యార్థులను పర్యవేక్షించేవారు. ఆ తర్వాత ఎవ్వరూ అక్కడ ఉండకపోవడంతో క్వార్టర్లు పాడయ్యాయి. దీంతో ఇటీవల కాస్త మరమ్మతులు చేసి వాటిని రీడింగ్ రూమ్‌లుగా మార్చారు. ఫుల్‌టైమ్ వార్డెన్లు గాకుండా బోధనాసుపత్రిలో పని చేసే వైద్యులనే వార్డెన్లుగా నియమించడంతో వారు ఇక్కడ పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారన్న విమర్శలు ఉన్నాయి. గతంలో ఉన్న ఇద్దరు వార్డెన్లు ఎగ్జామినర్లుగా ఇతర మెడికల్ కాలేజీలకు వెళ్లేవారు. దీంతో వారు వసతి గృహానికి వచ్చి పర్యవేక్షించడం చాలా తక్కువసార్లు జరిగేదన్న విమర్శలు ఉన్నాయి. వసతి గృహంలో ఎంత మంది విద్యార్థులున్నారు, ఎవరు తరగతులకు వెళ్తున్నారు, అక్కడ నిర్వహణ పరిస్థితి ఏమిటి, మెస్ నిర్వహణ ఎలాగుంది, సెక్యూరిటీ వంటి సమస్యల గురించి పర్యవేక్షించాల్సి ఉంటుంది. కనీసం వార్డెన్లు ఆకస్మికంగా తనిఖీలు చేపట్టే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఈ కారణంగా వసతి గృహాన్ని పర్యవేక్షించేందుకు ఎవ్వరూ రాకపోవడంతో పలువురు విద్యార్థులు ఇష్టారీతిన వ్యవహరిస్తూ సమస్యలు సృష్టిస్తున్నారు. మరోవైపు వార్డెన్‌గా ప్రొఫెసర్ స్థాయి వైద్యులే ఉండాల్సి ఉండటంతో ఆ స్థాయి వారు పనిచేయడానికి ముందుకు రావడం లేదు. ఇతర వసతిగృహాల మాదిరిగా ఇక్కడ కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా వార్డెన్లను నియమించి ఇక్కడే ఉండి పర్యవేక్షించేలా చేస్తే సమస్యలు చాలా వరకు సమసిపోయే అవకాశం ఉంది. కాగా ఈ విషయమై కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్‌ను వివరణ కోరగా ఇటీవల డిప్యూటీ, అసిస్టెంట్ వార్డెన్లను మార్చామని, ఇకపై వారు నిత్యం పర్యవేక్షణ చేసి సమస్యలు లేకుండా చూసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

9 నుంచి ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు

కర్నూలు కల్చరల్: ఈనెల 9,10 తేదీల్లో తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు శ్రీశ్రీ కళావేదిక జిల్లా కార్యదర్శి కవయిత్రి శ్రీమతి పరవస్తు లక్ష్మీ సురేఖా చారి తెలిపారు. అకాడమీ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ సారథ్యంలో జాతీయ, రాష్ట్ర, జిల్లా కమిటీల కార్యనిర్వహణలో 48 గంటల పాటు ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళాప్రదర్శనలు – పుస్తకావిష్కరణలు, ప్రపంచ సాహితీ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. కవులు, కవయిత్రులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆయుష్మాన్‌లో ల్యాంప్ లైటింగ్

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని ఆయుష్మాన్ నర్సింగ్ కళాశాల, మదర్ థెరిస్సా స్కూల్ ఆఫ్ నర్సింగ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మెగాసిరి ఫంక్షన్ హాల్‌లో ఘనంగా ల్యాంప్ లైటింగ్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌ఓ డాక్టర్ రామగిడ్డయ్య హాజరై మాట్లాడారు. వైద్య వృత్తిలో నర్సింగ్ కోర్సు ఎంతో కీలకమైనదని, సమాజంలో దానికో మంచి గుర్తింపు ఉందన్నారు. నర్సింగ్ కోర్సును పూర్తి చేసుకున్నవారు సేవా దృక్పథంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నందికొట్కూరు మాజీ ఎమ్మెల్యే ఐజయ్య, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, గుంటూరు కాలేజ్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ కళావతమ్మ, కళాశాల డైరెక్టర్ వై.చంద్రమౌళి, ప్రిన్సిపాల్ జి.సలోమి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు నైపుణ్యాలను సాధించాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు నైపుణ్యాలను సాధించాలని అనంతపురం జేఎన్‌టీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.రంగా జనార్దన్ అన్నారు. బుధవారం ఏక్యాంప్‌లోని మైపర్‌లో ఫార్మసీ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థి దశలోనే వివిధ అంశాల్లో నైపుణ్యాలు సాధిస్తే ప్లేస్‌మెంట్ పొందవచ్చన్నారు. మైపర్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విర్చోవ్ బయోటెక్ కంపెనీతో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులకు రెండు నెలలు శిక్షణ ఇచ్చి ఉద్యోగాల కల్పనకు తోడ్పడతామన్నారు. విర్చోవ్ సీఈవో రవికుమార్, కళాశాల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాపును బలుపనుకుంటున్న టీడీపీ



విలేకరుల సమావేశంలో 'మా నమ్మకం నువ్వే జగన్' స్టికర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

- కేసులుంటేనే ఎమ్మెల్యే సీట్లు ఇస్తామనడం శోచనీయం
- విలేకరులతో సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడంతో టీడీపీ నాయకులు వాపును బలుపు అనుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఎద్దేవా చేశారు. కనీసం 12 కేసులున్న వ్యక్తులకు ఎమ్మెల్యే సీట్లు ఇస్తామని టీడీపీ నాయకుడు నారా లోకేష్ అనడం శోచనీయమని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే తన నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ఉంటుందని, అందుకు సంబంధించి పోస్టర్లను, స్టీకర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, జేసీఎస్ కన్వీనర్లు, వలంటీర్లు అందరూ కలసి ఇంటింటికి తిరుగుతూ వారికి ప్రభుత్వం చేసిన మేలును వివరించాలన్నారు. వారి అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టికర్లు ఇంటికి అతికించాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో ప్రజలకు మంచి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో క్రైమ్ రెట్ తగ్గించి శాంతిభద్రతలు నెలకొంటున్నాయన్నారు. అయితే టీడీపీ నాయకులు కేసులు ప్రజలను రెచ్చగొడుతూ అలజడులు సృష్టించేందుకు యతిస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి మహిళల రక్షణ కోరకు దిశా యాప్ తీసుకువచ్చామన్నారు. అందుకు భిన్నంగా టీడీపీ నాయకులు కేసులు ఉన్నా వారికే సీట్లు ఇస్తామంటున్నారని, రాష్ట్రంలో ప్రజలు ఇదంతా గమనిస్తున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకుందామన్నారు. కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బి.మహేశ్వర్‌రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి జేసీఎస్ కన్వీనర్లు గోవర్ధన్‌రెడ్డి, హనుమంతురెడ్డి, పలువురు కార్పొరేటర్లు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు పాల్గొన్నారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం





'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లు విడుదల చేస్తున్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ , వైఎస్సార్ ఆసరా ఉత్సవాలకు హాజరైన మహిళలు

- ఆసరా సంబరాల్లో ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్
- సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

కర్నూలు (టౌన్): మహిళా సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని, ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట మేరకు సీఎం జగనన్న అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఏడాది వైఎస్‌ఆర్ ఆసరా పేరుతో రూ. కోట్లు నిధులు మంజూరు చేస్తున్నారని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. మళ్లీ మనందరం కలిసి కట్టుగా జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నగరపాలక సంస్థ పరిధిలోని 44వ వార్డు రామలింగేశ్వరనగర్‌లో వైఎస్‌ఆర్ ఆసరా సంబరాలు కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 958 గ్రూపులకు సంబంధించి 9,580 మందికి ఆసరా మూడవ విడత కింద మంజూరైన రూ.5.99 కోట్ల చెక్కును ఎమ్మెల్యే అందజేశారు. భారీగా తరలివచ్చిన మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఉన్న మాటల ప్రభుత్వానికి నేడు చేతల ప్రభుత్వానికి తేడా గమనించాలన్నారు. నాలుగేళ్లుగా ఈ ప్రభుత్వం చెప్పిన ప్రతి పథకం అమలు చేస్తోందన్నారు. ముఖ్యంగా అభివృద్ధితో పాటు మహిళలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. రాష్ట్రంలో పేద సామాన్య ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రకులాల్లోని మహిళలందరు తల ఎత్తుకొని జీవించే విధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఇటువంటి ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఏనాడు పేదల గురించి మాట్లాడని చంద్రబాబు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కన్నా.. ఎక్కువ చేస్తానని చెప్పడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, 42వ వార్డు కాశిరెడ్డి శ్వేతారెడ్డి, కార్పొరేటర్లు నగరూరు శ్రీనివాసరావు, కృష్ణకాంత్ రెడ్డి, షేక్ అహమ్మద్, మెప్మా టీపీఆర్ వెంటకలక్ష్మీ, సీఎంఎం జయవర్ధనే, టీఎంసీ సుధాకర్, సీఓలు రియాజ్, అశోక్, నగేష్, శిరీషా తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు

కర్నూలు(రాజ్‌విహార్): పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ అన్నారు. బుధవారం స్థానిక ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో 'జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్' అనే స్టిక్కర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సిఫార్సులు, కమీషన్లు లేకుండా కేవలం అర్హతే ప్రమాణికంగా పథకాలు మంజూరు చేస్తున్న ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. అధికారులు, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్దకే పథకాలు అందుతున్నాయన్నారు. పేదల సంక్షేమమే సీఎం జగనన్న లక్ష్యమని, చేసిన, చేయనున్న మంచిని ప్రజలకు వివరించేందుకు వార్డు కన్వీనర్లు, గృహ సారథులను నియమించినట్లు వెల్లడించారు. గత ప్రభుత్వం చేసింది, జగనన్న ప్రభుత్వం అందించిన పథకాలను వివరించాలన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి తాను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చేసిన మేలును వివరిస్తామన్నారు. ప్రజలు 8296082960 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి జగనన్న ప్రభుత్వాన్ని బలపర్చాలని కోరారు. జగనన్న సంక్షేమ ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పికొడుతామని చెప్పారు. అనంతరం పార్టీ నగర అధ్యక్షురాలు సిత్ర సత్యనారాయణమ్మ, పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య మాట్లాడుతూ సంక్షేమ పాలనను చూసి ఓర్వలేక ప్రతి పక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో పార్టీ కార్పొరేటర్లు అర్షియా ఫర్హీన్, యూనుస్, కృష్ణకాంత్, నాయకులు రాజేష్‌బాబు పాల్గొన్నారు.

7న గోమాత భక్త సమ్మేళనం

కర్నూలు కల్చరల్: ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు ఓర్వకల్ మండలం కాల్వబుగ్గ సమీపంలోని సురభిగోశాల భారతీయ స్ఫూర్తి కేంద్రంలో గో మాత భక్త సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గోమాత పూజతో కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు. పార్గికి చెందిన భాస్కరయోగి, వికారాబాద్‌కు చెందిన జయదేవ్‌లు ముఖ్య వక్తలుగా హాజరు కానున్నట్లు తెలిపారు. వికాస భారతి, సురభి గోశాల నిర్వహణ సమితి ప్రతినిధులు, సభ్యులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైభవంగా సీతారాముల కల్యాణం

సి.బెళగల్: శ్రీ హనుమాన్ జయంతి వేడుకల లో భాగంగా మండల కేంద్రంలోని పడమటి ఆంజనేయస్వామి (కోదండ రాముని) ఆలయంలో బుధవారం శ్రీ సీతారాముల వారి కల్యాణం వైభవంగా జరిగింది. వేద పండితు లు మధ్వాచార్యులు, అర్చకులు సుదర్శణాచార్యులు, నరహరి శర్మ శాస్త్రోక్తంగా కల్యాణాన్ని జరిపించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామికి పట్టు వస్త్రాలు, టెంకాయలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గురువారం ఆంజనేయ స్వామి రథోత్సవం నిర్వహించనున్నట్లు వేదపండితుడు మధ్వాచార్యులు తెలిపారు. గ్రామ ప్రజలు అందరు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. మండల పరిధిలోని క్రిష్ణ దొడ్డి గ్రామంలో కొండపై వెలసిన శ్రీ కోన వేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధ వారం తెల్లవారు జామున శ్రీవారిని గ్రామంలో గరుడవాహనంపై ఊరేగించారు. కొండపై నుంచి శ్రీ వారి ఉత్సవ విగ్రహాలను దిగువకు చేర్చి తేరుగుడి నుంచి ఎదురోలు వరకు ఊరేగించారు. క్రిష్ణదొడ్డిలో గురువారం శ్రీ వారి కల్యాణం, ప్రభోత్సవం నిర్వాహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ నిర్వాహకులు తెలిపారు. రాత్రి సంపూర్ణ రథోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గోశాలలో చాగంటి



గోశాల నిర్వాహకులతో మాట్లాడుతున్న చాగంటి కోటేశ్వరరావు

కర్నూలు కల్చరల్: బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు బుధవారం నగర శివారులోని గాయత్రీ గోశాలను సందర్శించి పూజలు నిర్వహించారు. గోశాల నిర్వహకులతో మాట్లాడారు. 810 గోవులను పోషించడం అభినందనీయమన్నారు. పారిశ్రామిక వేత్త గోశాల చైర్మన్ టి.జి. భరత్ చాగంటిని ఘనంగా సన్మానించి ఆశీర్వాదం తీసుకున్నారు. వాసవీ మహిళ మండలి ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

కర్నూలు కల్చరల్: క్వెస్ట్ ఒలంపియాడ్‌లో పాల్గొని ప్రతిభ కనపరచిన ఎన్‌ఆర్ పేట భాష్యం పాఠశాల విద్యార్థులను బుధవారం రాజ్యసభ మాజీ సభ్యులు టీజీ వెంకటేష్ తన స్వగృహంలో అభినందించారు. ఈమేరకు వారికి నగదు ప్రోత్సాహకాలతో పాటు మెడల్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: అక్రమ అడ్మిషన్లు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రంగప, నగర అధ్యక్షులు అమర్, నాయకులు చరణ్ తదితరులు వినతి పత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

మాతృ దినోత్సవ వేడుకలు

కర్నూలు కల్చరల్: మాధవీనగర్, రెవెన్యూ కాలనీలోని సాయి సుబ్బయ్య రవీంద్ర పాఠశాలల్లో బుధవారం మాతృదినోత్సవం ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వారి మాతృమూర్తులకు పాదాభివందనం చేసి చందన తాంబులాలు అందజేశారు. పాఠశాల కరస్పాండెంట్ పి.బి.వి.సుబ్బయ్య అధ్యక్షతన వేడుకలు జరిగాయి. వైస్ ప్రిన్సిపాల్ శారద తదితరులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి జగ్జీవన్‌రామ్

- ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ 116వ జయంతి

కర్నూలు(అర్బన్)/కర్నూలు కల్చరల్: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి డా.బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్నూలు నగరంలో బుధవారం పలు విద్యా సంస్థలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్థానిక ఐదు రోడ్ల కూడలిలో ఉన్న ఆయన విగ్రహానికి పలు దళిత, ప్రజా, ఉద్యోగ సంఘాల నేతలు నివాళి అర్పించారు. మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ (మేడ్) ఆధ్వర్యంలో నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు బెన్నమ్మ, రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. జెడ్పీలోని మినీ సమావేశ భవనంలో జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి నివాళి అర్పించారు.

గొప్ప దార్శనికుడు జగ్జీవన్ రామ్

కల్లూరు: స్వాతంత్య్ర సమరయోధుడు, సంఘ సంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ గొప్ప దార్శనికుడని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్ పార్కులో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. స్థానిక కార్పొరేటర్ జయరాముడు, దళిత క్రిస్టియన్ పోరాట సమితి నాయకులు రాజ్‌కుమార్, శివ, హుస్సేన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (రాజ్‌విహార్): బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి బాబూ జగ్జీవన్‌రామ్ అని వైఎస్‌ఆర్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు, మేయర్ బీవై రామయ్య అన్నారు. స్థానిక బిర్లా కాంపౌండ్ ఆవరణలోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రామయ్య మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో పేదల అభివృద్ధికి జగ్జీవన్‌రామ్ విశేష కృషి చేశారన్నారు. నేటి తరం యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్‌చంద్ర బోస్, పార్టీ నాయకులు సీహెచ్ మద్దయ్య, గోపాల్‌రెడ్డి, ధనుంజయ ఆచారి, లక్ష్మీ కాంతయ్య పాల్గొన్నారు.

- పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బిర్లాకాంపౌండ్‌లోని కార్యాలయంలో జరిగిన వేడుకల్లో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.కరుణానిధి మూర్తి, నంద్యాల జిల్లా అధ్యక్షులు ఎస్.వి.కృష్ణారెడ్డి, కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్ బీవై రామయ్య

- రాయలసీమ విశ్వవిద్యాలయంలో జరిగిన వేడుకల్లో వర్సిటీ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆనందరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సుందరానంద, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎమ్.ఇ.రాణి, ప్రొఫెసర్లు పాల్గొని నివాళులు అర్పించి ప్రసంగించారు.
- క్లస్టర్ యూనివర్సిటీలో జరిగిన వేడుకల్లో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ పురుషుల డిగ్రీకళాశాల ప్రిన్సిపాళ్లు వి.వి.ఎస్. కుమార్, డాక్టర్ హేమంత్‌పాల్గొని ప్రసంగించారు.
- ఏక్యాంప్ మైపర్‌లో ఫార్మసీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అనంతపురం జేఎన్‌టీయూ వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ జి. రంగా జనార్దన్, కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, విర్చోవ్ సీఈవో రవికుమార్ నివాళులు అర్పించారు.
- వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నగర అధ్యక్షులు టి.సి. మద్దిలేటి అధ్యక్షతన జరిగిన వేడుకల్లో జిల్లా అధ్యక్షులు గోరంట్ల రమణ, కోశాధికారి అయోధ్య శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జెడ్పీలో చిత్ర పటానికి పూలమాల వేస్తున్న సీఈఓ జి.నాసరరెడ్డి, డిప్యూటీ సీఈఓ ఈవీ సుబ్బారెడ్డి

- కర్నూలు(సెంట్రల్): స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి డీసీసీ అధ్యక్షుడు ఎం.సుధాకరబాబు తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.
- కర్నూలు(హాస్పిటల్): జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా పేదలకు బుధవారం స్థానిక గాయత్రి ఎస్టేట్‌లోని శ్రీసాయి గురుదత్త పాలీ క్లినిక్‌లో గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి.శంకర్‌శర్మ పాదరక్షలు, గొడుగులు పంపిణీ చేశారు.
- కర్నూలు (లీగల్): బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాద సంఘ అధ్యక్షులు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎం.వి.చక్రపాణి తదితరులు నివాళులర్పించారు.
- కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ భవన్‌లో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకను విద్యుత్ శాఖ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం. ఉమాపతి తదితరులు నిర్వహించారు.
- కర్నూలు(అగ్రికల్చర్): కలెక్టరేట్‌లోని జిల్లా నీటియాజమాన్య సంస్థ కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్వామా అదనపు పీడీ సలీమ్ బాషా, ఏవో నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.